94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv స్థాపితం : 2015

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

అమరావతి సంపుటి : 1 సంచిక : 132, పేజీలు 4, వెల: రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు దిన పత్రిక | శుక్రవారం, 24-05-2019

Amaravati Volume : 1 Issue : 132, Pages 4, Rate : 2.00 | ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU DAILY | Friday, 24-05- 2019

**అసెంబ్లీ**

| 151 | 23 | 1 |
|---|---|---|
| వైఎస్సార్ సీపీ | తెలుగుదేశం | జనసేన |

**పార్లమెంట్**

| 22 | 3 |
|---|---|
| వైఎస్సార్ సీపీ | తెలుగుదేశం |

**కేంద్రంలో**

ఎన్డీయే : 348

యూపీఏ : 85

ఇతరులు : 109

పైన పేర్కొన్న ఫలితాలు రాత్రి 10.30 వరకు వచ్చినవి

## యెడుగూరి సందింటి

# జగన్మోహన్ రెడ్డి అను నేను..



**ఎన్నాళ్లో వేచి చూసిన అద్భుత దినాన ..**
**రాజన్న కొడుకుకోసం ప్రజలు ఎంతగా ఎదురు చూశారన్నది సునామీలాంటి విజయంలో తెలుస్తోంది.. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు152 సీట్లు, 25 లోక్‌సభ సీట్లకు మొత్తం చేజిక్కించుకున్న వైసీపీ విజయదుంధుబి వెనుక మాటతప్పని, మడమతిప్పని జననేత జగన్ విశ్వసనీయత ఉంది. దేశంలో అత్యధిక విద్యావంతులున్న పార్టీగా అత్యున్నత ఫలితాలను సాధించి దేశవాసుల దృష్టిని వైసీపీ ఆకర్షించింది.ఈ ఘన విజయం సాధించిన జగన్మోహన్‌రెడ్డి కి రాజధాని వార్తలు శుభాభినందనలు తెలుపుతోంది.**

### విజయవాడలో ప్రమాణ స్వీకార మహోత్సవం

**రాజధాని వార్తలు, అమరావతి :** వైసీపీ శాసనసభ పక్ష సమావేశం ఈనెల 25న తాడేపల్లిలోని పార్టీ ఆఫీసులో జరగనుంది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 30 న విజయవాడలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానాకి పలువురు ప్రముఖుల్ని వైసీపీ ఆహ్వానించనుంది. మే 30న ఏకాదశి కావడంతో మంచిరోజుని భావించి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జగన్ జాతక ప్రకారం కూడా ఆ రోజు బావుందని జ్యోతిష్యులు చెబుతున్నారు. మరోవైపు ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ముహూర్తంపై వైసీపీ నేతలు విశాఖ శారదా పీఠాధిపతిని సంప్రదించినట్లు సమాచారం.

### వైసీపీ సంబరాలు

పార్టీ శ్రేణులంతా స్వీట్స్ తినిపించుకుంటున్నారు. డప్పులు, నృత్యాలు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. తాడేపల్లితో పాటు.. కేంద్ర కార్యాలయం లోటస్ పాండ్ వద్ద కూడా పండగ వాతావరణం నెలకొంది.ఏపీలో వైసీపీ ప్రభంజనం కొనసాగుతోంది. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచీ వైసీపీ స్పష్టమైన ఆధిక్యం దిశగా దూసుకుపోతుంది. పలుజిల్లాల్లో వైసీపీ క్లీన్ స్వీప్ దిశగా సాగుతోంది. విజయనగరం జిల్లాలో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. దీంతో వైసీపీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నాయి. ఎక్కడికక్కడ పార్టీ నాయకులంతా సంబరాలు చేసుకుంటున్నారు. బాణాసంచా కాల్చుతూ ఉత్సవాలు జరుపుకుంటున్నారు.తాడేపల్లిలో జగన్ నివాసానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు చేరుకుంటున్నారు.

### బాబుకు ఉద్యోగులు ఝలక్

గతంలో ఓసారి చంద్రబాబు కేవలం రాష్ట్ర ఉద్యోగుల వల్ల ఓడిపోయారు. ఉద్యోగుల్ని రాచిరంపాన పెట్టడంలో వాళ్లంతా బాబుకు వ్యతిరేకంగా పనిచేశారు. ఇప్పుడు మరోసారి అదే ట్రెండ్ కనిపిస్తోంది. ఈసారి కూడా ఉద్యోగులంతా మూకుమ్మడిగా బాబును తిరస్కరించినట్టు తెలుస్తోంది.ఓట్ల లెక్కింపులో భాగంగా ముందుగా పోస్టల్ బ్యాలెట్ పేపర్లు లెక్కించారు. ఈ లెక్కింపులో టీడీపీకి గట్టిదెబ్బ తగిలింది. దాదాపు ఉద్యోగులంతా వైసీపీకి అనుకూలంగా ఓటేశారు. ఇలా చంద్రబాబుకు శుక్రవారం ఉదయమే గట్టిదెబ్బ తగలగా, ఉద్యోగస్తులు మరోసారి బాబుపై తమ కసి తీర్చుకున్నారు.

చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఉద్యోగులకు నిద్ర ఉండదు. వాళ్లను ప్రశాంతంగా ఉండనివ్వరు బాబు. అడ్డమైన పనులన్నీ ఉద్యోగులకే అంటగడతారు. చివరికి తన పార్టీ పనుల కోసం కూడా ఉద్యోగుల్ని వాడుకున్న దాఖలాలు కోకొల్లలు.పదేళ్లు ఉమ్మడి రాజధాని ఉందని తెలిసి కూడా ఉద్యోగుల్ని హైదరాబాద్ నుంచి అమరావతికి తిప్పారు. ఆదివారాలు కూడా విశ్రాంతి లేకుండా చేశారు. ఈ కోపం మొత్తం పోస్టల్ బ్యాలెట్ లో స్పష్టంగా కనిపించింది. ఈ ఫలితాల నుంచే చంద్రబాబు పతనం మొదలైంది. తర్వాత అదే ట్రెండ్ ఈవీఎంలలో కూడా కొనసాగింది.

### ఉస్సూరన్న మంత్రులు

మొన్నటివరకు కన్నుమిన్ను చూడకుండా ఇష్టమొచ్చినట్టు పరిపాలన సాగించారు. అవినీతి అనే పదం కూడా చిన్నబోయేలా వ్యవహరించారు. ఇప్పుడు వాళ్లంతా తగినమూల్యం చెల్లించుకుంటున్నారు. అవును.. ఏపీలో మంత్రులు మొదటి రౌండ్ కే ఘోర పరాభవం దిశగా దూసుకెళ్లారు. టీడీపీకి చెందిన కీలకమైన మంత్రులంతా ఇప్పుడు వెనుకంజలో ఉన్నారు. వాస్తులు, సర్వేలు చూసుకొని మరీ నియోజకవర్గాన్ని ఎంచుకున్న గంటా శ్రీనివాసరావుకు ఈసారి పరాభవం తప్పదు. వైజాగ్ నార్త్ నియోజకవర్గంలో గంటా శ్రీనివాసరావు పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ఆ స్థానంలో వైసీపీ అభ్యర్థి కన్నపరాజు దూసుకెళ్లారు. నెల్లూరు సిటీ నుంచి నారాయణ, సర్వేపల్లిలో సోమిరెడ్డి పరిస్థితి కూడా ఇలానే తయారైంది. మొదటి రౌండ్ ముగిసేసరికి వైసీపీ అభ్యర్థి అనిల్ కుమార్ కంటే బాగా వెనకబడి ఉన్నారు నారాయణ. అటు సర్వేపల్లిలో కూడా సోమిరెడ్డి పక్కకు తప్పుకొని కాకానికి దారిచ్చారు.ఇక ఉత్తరాంధ్రలో నేనే కీలకం అంటూ గొప్పలు చెప్పుకునే అచ్చెన్నాయుడు కూడా వెనకంజలో ఉన్నారు. టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నాయుడుపై పేరాడ తిలక్ ఆధిపత్యం కనిపిస్తోంది. ఇలా టీడీపీకి చెందిన పలువురు మంత్రులు ప్రస్తుతం వెనుకబడ్డారు.

### రెండో రౌండ్‌లోనే ఏపీలో ఫ్యాన్ సునామీ...

**రావాలి జగన్ కావాలి జగన్ అన్న వైసీపీ నినాదానికి ఏపీ ప్రజలు పూర్తిగా ఆకర్షితులయ్యారని ఫలితాల సరళిని బట్టి అర్థమైంది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచే వైసీపీ దూకుడు కొనసాగింది. పోస్టల్ బ్యాలెట్లు మొదలుకుని ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్లు వరకు అంతా వైసీపీకే పడ్డాయని ఫలితాలను బట్టి అర్థమవుతోంది. స్వయంగా ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సైతం పలు రౌండ్లలో వెనుకబడిపోయారంటే ఏపీలో వైసీపీ జోరు ఏ రకంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.**

**ఏకంగా వందకు పైగా అసెంబ్లీ సీట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ముందంజలో ఉండటం గమనార్హం.తెలుగుదేశం పార్టీ కేవలం 23 ఎమ్మెల్యే సీట్లలో మాత్రమే ఆధిక్యత సంపాదించింది.ఎంపీ సీట్ల విషయానికి వస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లలో ఆధిక్యత కనబరుస్తూ ఉంది. తెలుగుదేశం పార్టీ మూడు ఎంపీ సీట్లలో ఆధిక్యతను కలిగి ఉంది.సంచలన అంశం ఏమిటంటే.. కుప్పంలో చంద్రబాబు నాయుడు వెనుకబడటం. రెండో రౌండ్ కౌంటింగ్ ముగిసే సరికి కుప్పంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చంద్రమౌళి అరవై ఏడు ఓట్ల మెజారిటీని సాధించారు.జనసేన అధిపతి పవన్ కల్యాణ్ రెండు అసెంబ్లీ స్థానాల్లోనూ వెనుకబడి ఉండటం గమనార్హం. ఆధిక్యంలో ఉన్న నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు స్పష్టమైన మెజారిటీలు సాధిస్తూ ఉన్నారు.**

### సైకిల్‌కి పంచర్

వైసీపీ నేతలు, కార్యకర్తల నమ్మకం వందకు వంద శాతం నిజమైంది. ఏపీలో వైసీపీ సునామీ సృష్టించింది. టీడీపీ భ్రమలు తొలుగుతున్నాయి. ఫ్యాన్ గాలి జోరు ముందు ఆ పార్టీ కుదేలైంది. చిగురుటాకులా వణుకుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా బలంగా వీచిన సమయంలోనూ చంద్రబాబు ఓట్ల లెక్కింపు సమయంలో వెనుకబడ్డ సందర్భాలు లేవు. అలాంటిది వైసీపీ సునామీలో చంద్రబాబు కూడా కొన్ని రౌండ్లలో వెనుకబడాల్సి వచ్చింది.

ఇప్పటివరకు వచ్చిన ఫలితాల ప్రకారం.. ఏపీ అంతటా వైసీపీ ప్రభంజనం కొనసాగుతోంది. ఏకంగా 150 స్థానాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లీడింగ్ లో ఉంది. అటు టీడీపీ మాత్రం కేవలం 24 స్థానాల్లో లీడింగ్‌లో

ఉంది. తాజా ఫలితాల సరళి చూస్తుంటే.. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ చెప్పిందే నిజమయ్యింది. సీఎం చంద్రబాబు తనయుడు లోకేష్, పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు మంత్రులు ఓటమి దిశగా సాగుతున్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, లోకేష్, నారాయణ, నక్కా ఆనంద్ బాబు, కొల్లు రవీంద్ర, ఆదినారాయణ, శిద్ధా రాఘవరావు, అఖిలప్రియ, చినరాజప్ప, గంటా శ్రీనివాస్, సుజయకృష్ణ రంగారావు, కళావెంకట్రావు వెనుకంజలో

ఉన్నారు. మంత్రుల్లో దేవినేని ఉమ, జవహర్, ప్రత్తిపాటి, అమర్నాథ్ రెడ్డి మాత్రమే ముందంజలో ఉన్నారు.

పులివెందుల ప్రజలు జగన్ కు రికార్డు మెజారిటీ కట్టబెట్టేందుకు రెడీ అయ్యారు. అటు కుప్పంలో చంద్రబాబుకు ఆధిక్యం కొనసాగుతోంది.జనసేన విషయానికొస్తే, ఆ పార్టీకి చెందిన క్యాండిటేట్లు ఎవరూ ఖాతా తెరవలేదు. ఏ ఒక్కరూ కనీసం రెండో స్థానంలో కూడా నిలవలేదు. చివరికి అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా గాజువాక, భీమవరంలో వెనుకంజలో ఉన్నారు.

### అభిమానులకు అభినందనలు

**రాజధాని వార్తలు, తాడేపల్లి :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇంత గొప్ప తీర్పు ఇచ్చిన ప్రజలు తనపై మరింత బాధ్యత ఉంచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.



కౌంటింగ్ అనంతరం గురువారం సాయంత్రం ఆయన తాడేపల్లి మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ...'గొప్ప విజయం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది ఒక నూతన అధ్యాయం. దేవుడి దయ, ప్రజల దీవెనలతో ఈ విజయం సాధ్యమైంది. ఈ విజయం నా బాధ్యతను పెంచుతుంది. ప్రజలంతా విశ్వసనీయతకు ఓటు వేశారు. ఏడాదిలోపే మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటా. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకుంటాం. తొలి సంతకం కాదు...నవరత్నాల హామీలును అమలు చేస్తాం. పాదయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరి కష్టాలను నేను చూశా.... నేను విన్నా ..నేను ఉన్నా. ఈ నెల 30 విజయవాడలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తా' అని తెలిపారు.


రాజధాని వార్తలు

జగనే సిఎం

మేనిఫెస్టో హైలైట్స్

మేనిఫెస్టో ముఖ్యాంశాలు

రాష్ట్రంలో జగన్ పాలన రాబోతుందని, ఈ సారి ఎన్నికల్లో జగన్ ఘన విజయం సాధించబోతున్నాడని "రాజధాని వార్తలు" 10-04-2019 న ప్రచురించిన కథనం

# రైతులకు అధిక ప్రాధాన్యం...

**రాజధాని వార్తలు కలం**

## విజయానికి దగ్గరి దారుల్లేవ్...

విజయానికి దగ్గరి దారులుండవు.. కఠోర శ్రమ, అకుంఠిత దీక్షతో ముందడుగు వేస్తేనే విజయం వరిస్తుంది. అందుకు సరైన ఉదాహరణ వైఎస్ జగన్మోహన రెడ్డి. ఒకప్పుడు అందరిలాగే ఆయన కూడా తండ్రి చాటు బిడ్డ..ఇంకా చెప్పాలంటే చదువుకోసం విదేశాలు పంపితే తల్లిదండ్రులను చూడకుండా ఉండలేనని ఇంటికి తిరిగి వచ్చిన ఒక సాధారణ కుమారుడు. అయితే మారిన పరిస్థితుల్లో కష్టాల కొలిమిలో రాటు దేలి,వజ్రకాయుడిగా రూపొందిన ధీశాలి జగన్.

ప్రజాభిమానం మెండుగా సంపాదించుకున్న వైఎస్ రాజశేఖర రెడ్డి 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడం, కుటుంబానికి, రాష్ట్ర ప్రజలకు ఆశనిపాతం. అదే సమయంలో దేశంలోని క్షుద్రరాజకీయాలు ఆయన కుటుంబాన్ని ముప్పతెప్పలు పెట్టాయి. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక ఎందరో మృతి చెందారని వార్తలు రావడంతో వారి కుటుంబ సభ్యులను సందర్శిస్తానని కర్నూలు జిల్లా నల్లకాలువ వద్ద జరిగిన సభలో ఆయన మాట ఇవ్వడం కాంగ్రెస్ అధిష్టానానికి కంటగింపుగా మారడంతో జగన్ జీవితాన్ని అగ్నిగుండం అయ్యింది. ఆత్మాభిమానం చంపుకోకుండా పరిస్థితులకు ఎదురీదుతూ విజేతగా ప్రజల ముందుకు వచ్చే క్రమంలో అనుక్షణం కఠిన పరీక్షకు గురయ్యారు. రాష్ట్ర రాజకీయ నాయకులు విలువలకు తిలోదకాలిచ్చి, నోటికి పనిచెప్పి ప్రతి క్షణం ఆయనను హింసించినా, ఆయన మాత్రం కట్టుబాట్ల హద్దుమీర లేదు. తండ్రి హయాంలో 2009లో 1.78 లక్షల భారీ మెజారిటీతో కడప ఎంపీగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయనకు తండ్రి ఆకస్మిక మరణం, అనంతరం పరిమాణాల్లో 2010 నవంబరు 29న కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి, 2011మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రారంభించారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో జగన్ 5.45 లక్షల ఓట్లతో భారీ విజయం సాధించి రికార్డు సృష్టించారు.అయినా అడుగడుగునా అవమానాలు, నిందలతో రాష్ట్ర అధికార పార్టీ జగన్‌ను హింసించింది.

2014లో గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలను అధికార తెలుగుదేశం పార్టీ కొనుక్కుంది.అంతేకాదు వారితో రాజీనామా చేయించక పోగా, వారితోనే ప్రతిపక్షాలను తిట్టించే ఒక హీనసంస్కృతికి తెలుగుదేశం అధినేత తెరలేపారు.అసెంబ్లీ సాక్షిగా వైసీపీ సభ్యులపై నోరు పారేసుకొంటూ, రౌడీల్లా ప్రవర్తించేవారు. స్పీకర్ వారిపై చర్యలు తీసుకోలేదు కదా.. కనీసం మాట్లాడటానికి ఛాన్సుకూడా ఇచ్చేవారు కాదు..దీంతో ప్రజాసంకల్ప యాత్ర పేరుతో ప్రజల మధ్యకు వచ్చారు. అయినా అవమానాలు తగ్గలేదు.. అసెంబ్లీ నుంచి పారిపోయాడని, సభకు హాజరవ్వకుండా జీతాలు తీసుకుంటున్నారని, అధికారపక్షమే కాదు..అసెంబ్లీ అంటే ఏంటో తెలియని దారేపోయేవాళ్లు కూడా తిడుతుండే వారు. ఇవేమీ పట్టించుకోకుండా 14 నెలలపాటు, 13జిల్లాల ప్రజలను కలవడం కోసం 3648 కిలోమీటర్ల (కశ్మీర్ నుంచి కన్యాకుమారి కన్నా ఎక్కువ దూరం) మేరకు సాగిన కాలినడకన ఆయన ప్రజలకు మరింత చేరువయ్యారు.

రాజ్యహింస, ప్రజావ్యతిరేక పాలన, ప్రభుత్వాల అణచివేతపై తరచూ మాట్లాడే వామపక్షాలు, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ, అధికారపార్టీ విపక్షాల ఎమ్మెల్యేలను కొంటుంటే ఒక్క మాట మాట్లాడకుండా, ప్రజాసమస్యలపై మాట్లాడే అవకాశం ఇవ్వని స్పీకర్‌కు మద్దతిస్తూ, అసెంబ్లీకి పోలేదని వైసీపీని దుయ్యబట్టడం ఈ రాష్ట్ర కామ్రేడ్లకే చెల్లింది.

వైఎస్ హయాంలో ప్రాజెక్టులకు శ్రీకారం చుడితే జలయజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చారని ఊరూ..వాడా నానా గోల చేసి, అప్పటి కేంద్ర ప్రభుత్వ అండతో జగన్‌పై అక్రమార్జన కేసులు, అధికారులపై అవినీతి కేసులు పెట్టి వారిని జైలుపాలు చేసిన ఘనత అపార అనుభవ శాలిదే..బీజేపీతో జతకట్టి, అదీ చాలక మరో నటుడిని చేరదీసి ప్రచారం చేయించారు. ఇంత చేస్తే గత ఎన్నికల్లో జగన్‌కు విజయం సాధించిన సీనియర్ రాజకీయ నాయకుడికి మధ్య ఓట్ల తేడా 1.6 మాత్రమే..

2014 ఎన్నికల్లో రుణమాఫీ పేరుతో రైతులను, ఉద్యోగాలపేరుతో యువతను, డ్వాక్రా రుణమాఫీ పేరుతో మహిళలను మోసం చేసిన అధికారపార్టీ ఈ ఏడాది ఎన్నికల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక ప్రతిపో నాయకుడు బీజేపీతో జతకడతాడని అభాండాలు మోపారు. అయితే అధినేత మాటలతో పూర్తిగా విసిగిపోయిన జనం జగన్‌కు పట్టం కట్టారు.

**నవరత్నాలు, మేనిఫెస్టో అమలుపై దృష్టి...**
**అత్యవసర నిధుల కోసం వైసీపీ వేట**

**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సంక్షేమ పథకాలతో తన మేనిఫెస్టోను ప్రకటించింది. అందుకు తగ్గట్టుగానే ఘన విజయం సాధించింది. నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ భరోసా ఇచ్చిన ఆ పార్టీ అధినేత జగన్... రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్ర చేసి పేదలకు అండగా నవరత్నాల హామీలను కలిపి మేనిఫెస్టోను రూపొందించారు. ఇక ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి హామీలను అమలు చేసే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టబోతున్నారు. ఐతే... పార్టీ పేరునే యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీగా (వైఎస్‌ఆర్‌పీ) పెట్టిన జగన్... ముఖ్యమంత్రికాగానే యువకులు, రైతులు, శ్రామికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబోతున్నారని తెలిసింది.

**వైసీపీ మేనిఫెస్టోలో కీలక అంశాలు**

రైతులకు ఉచితంగా బోర్లు, కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు, రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్

రైతుల కోసం రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, ఆక్వా రైతులకు యూనిట్ రూపాయికే కరెంటు, రైతులకు రూ.12,500 చొప్పున 4 దఫాలుగా రూ.50వేలు, రైతు కుటుంబాలకు రూ.7లక్షలతో బీమా, రైతులకు సున్నా వడ్డీకే రుణాలు, వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి ప్రకటించారు. అన్ని రకాల వ్యాధులు ఆరోగ్య శ్రీ పరిధిలోకి, కిడ్నీ సహా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10వేలు పింఛన్, వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలకు పెంపు, పింఛన్ అర్హత వయసు 65 నుంచి 60కి తగ్గింపు,అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1150 కోట్లు కేటాయింపు, మూడు దశల్లో మద్యపాన నిషేధం. 2024 నాటికి పూర్తిగా నిషేధం వంటివి దానిలో ఉన్నాయి. ఖాళీగా ఉన్న లక్షా 30వేల ఉద్యోగాలు భర్తీ, ఐదేళ్లలో 25 లక్షల ఇళ్ల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ అమ్మాయిల పెళ్లికానుక కింద రూ.లక్ష... బీసీ అమ్మాయిలకు రూ.50వేలు ఆర్థిక సాయం, కాపు కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయింపు, శాశ్వత ప్రాతిపదికన బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఏర్పాటు, అర్చకులకు రిటైర్మెంట్ విధానం రద్దు, ఇళ్ల నిర్మాణం, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం ఓ జిల్లాగా ఏర్పాటు, పిల్లలను బడికి పంపిస్తే, ప్రతీ తల్లికి ఏడాదికి రూ.10,500, 45 ఏళ్లు నిండిన ప్రతీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు మొదటి ఏడాది తర్వాత రూ.75వేలు అమలు చేస్తామన్నారు.

ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు, పోలవరం, వెలిగొండ పథకాలు పూర్తి, గ్రామ సచివాలయం ఏర్పాటు. అదే గ్రామంలో 10మందికి ఉద్యోగం, జీవన భీమా కింద 18సం. నుంచి 50సం. లోపు ఉన్నవారు మరణిస్తే రూ.1లక్ష, బీసీఅభ్యున్నతికి ఏడాదికి రూ.15వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.75వేల కోట్లు ఖర్చు, ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, మగ్గం ఉన్న ప్రతీ కుటుంబానికి సంవత్సరానికి రూ.24వేలు ప్రోత్సాహం, చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు, సున్నా వడ్డీకే రూ.10వేలను వైసీపీ ఎన్నిక వాగ్దానాల్లో పేర్కొంది.

**పథకాల అమలుకు రూ.56 వేల కోట్లు**

వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోలోని కొత్త పథకాలకు రూ.56,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా. పిల్లలను

పథకాల అమలుకు రూ.56 వేల కోట్లు : వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోలోని కొత్త పథకాలకు రూ.56,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా. పిల్లలను బడికి పంపే తల్లులకు ప్రతి ఏటా రూ.15,000 ఇస్తానని జగన్ చెప్పిన పథకానికి ఎక్కువ ఖర్చు అయ్యే అవకాశాలున్నాయి. పెట్టుబడి కోసం ప్రతి రైతు కుటుంబానికి రూ.50,000 ఇస్తామని వైసీపీ మేనిఫెస్టోలో చెప్పారు కాబట్టి... ఇది కూడా కష్టసాధ్యమైన పథకమే. పెన్షన్లు రూ.3వేలకు పెంచితే, ప్రభుత్వంపై అదనంగా ఏడాదికి రూ.6,400 కోట్లకు పైగా భారం పడుతుంది. ప్రస్తుత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి... రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టింది. కేంద్రం నుంచీ నిధులు రావకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చినట్లు చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వస్తున్న వైసీపీ... నిధుల కోసం వేటాడాల్సి వస్తుంది. ఈ సమస్య నుంచీ రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తారన్నది వైసీపీ ముందు ఉన్న అసలైన సవాల్ అని మనం అనుకోవచ్చు.

**ఈ విజయం పాదయాత్రదే పట్టం..**



పాదయాత్రలు చేసేవారిని ప్రజలు గుండెలకు హత్తుకుంటారని మరోసారి రుజువైంది. తమ కోసం వచ్చిన జగన్‌ను రావాలి జగన్, కావాలి జగన్ అంటూ ప్రజలు ఘనస్వాగతం పలికారు. రావాలి జగన్... కావాలి జగన్ : టీడీపీ అంత కాకపోయినా వైసీపీ కూడా తమదైన స్థాయిలో యాడ్లు చేయించింది. ముఖ్యంగా రావాలి జగన్, కావాలి జగన్ అనే టైటిల్ సాంగ్ తో వచ్చిన యాడ్‌కి ప్రజల నుంచీ మంచి స్పందన వచ్చింది. ఇది ఎంతలా ఆకట్టుకుందంటే... ప్రతి ఒక్కరూ ఈ సాంగ్‌ని సరదాగా పాడుకునేంతలా అది మైండ్‌లోకి ఎక్కేసింది. అదే సమయంలో... రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ టీం ఐపీఏసీ తెరవెనక వైసీపీ గెలుపుకోసం దాదాపు రెండేళ్ల నుంచీ కృషి చేసింది. సోషల్ మీడియాలో సైతం వైసీపీ అభిమానులందర్నీ ఒకే తాటిపైకి తెచ్చి... ముందుకు నడిపించింది. ఫలితం అదిరిపోయింది. జగన్ కూడా ఊహించనంతటి విజయం వైసీపీకి దక్కింది.

**కిషోర్..కింగ్**

ఉత్తరప్రదేశ్ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున వ్యూహాలు రచించి దెబ్బతిన్న ప్రశాంత్ కిషోర్... ఇప్పుడు మాత్రం వైసీపీని గెలిపించడంలో గ్రాండ్ సక్సెస్ అయ్యారు. అందువల్ల ఇప్పుడు ఆయనకు మళ్లీ మంచి రోజులు వచ్చినట్లే. మరిన్ని పార్టీలు ఆయనను రాజకీయ వ్యూహకర్తగా నియమించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల అన్నీ వదిలేసి సొంత రాష్ట్రం బీహార్‌కి వెళ్లిపోవాలనుకున్న ప్రశాంత్ కిషోర్... ఇప్పుడు మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లో కొనసాగే వీలుంది.

**ఏపీ రాజకీయాల్లో కొత్త రికార్డ్**

రాజకీయాల్లో వారసత్వం అనేది కొత్తేమీకాదు. తమ కుటుంబసభ్యుల బాటలో అనేక మంది నాయకులు రాజకీయాల్లోకి వచ్చారు. వారిలో కొంతమంది రాణించగా... మరికొంతమంది విఫలయ్యారు. అలా తెలుగు రాష్ట్రాల్లోనూ అనేక మంది నాయకులు వారసత్వంగానే రాజకీయాల్లోకి వచ్చి రాణిస్తున్నారు. అయితే ఇలాంటి వారిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాస్త ప్రత్యేకమనే చెప్పాలి. తెలుగు రాష్ట్రాల్లో తండ్రి తరువాత రాష్ట్రానికి సీఎం అయిన మొదటి వ్యక్తిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రికార్డ్ సృష్టించబోతున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. ఆయన తనయుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి... వైఎస్ఆర్ మరణం తరువాత రాష్ట్రానికి సీఎం అయ్యేందుకు ప్రయత్నించి విఫలయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్‌ను వీడి వైసీపీని స్థాపించిన జగన్... రాష్ట్ర విభజన కారణంగా ఏపీ రాజకీయాలకు పరిమితమయ్యారు. 2014లో అధికారంలోకి రాలేకపోయినా 2019లో తాను అనుకున్నది సాధించారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ముందు అనేక మంది నేతలు ఏపీకి ముఖ్యమంత్రులుగా పని చేశారు. అయితే వారి వారసులెవరూ రాష్ట్రానికి ముఖ్యమంత్రులు కాలేకపోయారు. మాజీ ముఖ్యమంత్రులు పీవీ నరసింహారావు, ఎన్టీ రామారావు, కాసు బ్రహ్మానందరెడ్డి రాజకీయ వారసులు మంత్రులుగా పని చేసినా... సీఎం స్థాయికి మాత్రం ఎదగలేకపోయారు. దీంతో ఈ బ్యాడ్ సెంటిమెంట్ జగన్‌ను కూడా వెంటాడుతుందనే ఊహాగానాలు బలంగా వినిపించాయి. అయితే తండ్రి తరహాలోనే సుదీర్ఘమైన పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి...ఆయనలాగే సీఎం పదవిని చేపట్టబోతున్నారు.

**జగన్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు...**

ఏపీ కాబోయే సీఎం జగన్‌కు తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు చెప్పారు. భారీ విజయం సాధించిన వైసీపీ పార్టీకి ట్విటర్ వేదికగా కంగ్రాట్స్ తెలిపారు. జగన్ కఠోర శ్రమకు ప్రజల ఆశీర్వాదం రూపంలో ఫలితం వచ్చిందన్న కేటీఆర్...తమ సోదర రాష్ట్రం ఏపీకి సుపరిపాలన అందిస్తారని ఆశిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. కాగా, ఏపీ ఎన్నికల ఫలితాల్లో వైసీపీ దూసుకుపోతోంది. ఏకంగా 150 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ అధికార టీడీపీకి ఏమాత్రం అందనంత ఎత్తుకు వెళ్లిపోయింది. లోక్‌సభ ఫలితాల్లో 25కు 25 చోట్ల క్లీన్ స్వీప్ దిశగా పరుగులు పెడుతోంది.

- ఖాన్

## మోదీ, జగన్‌కు కేసీఆర్ శుభాకాంక్షలు



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత ముందుకుపోవాలని ఆకాంక్షించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో భారీ విజయం సాధించిన వైకాపా అధ్యక్షుడు జగన్‌కు కేసీఆర్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జగన్ నాయకత్వంలో ఏపీ ముందడుగు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు మెరుగవుతాయని కేసీఆర్ ఆకాంక్షించారు. జగన్‌కు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. మీరు పడిన కష్టానికి ప్రజల ఆశీర్వాదం రూపంలో మంచి ఫలితం దక్కిందని కొనియాడారు.

## అన్నదమ్ముళ్లకు షాకిచ్చారు!



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** ప్రశ్నిస్తా అంటూ ప్రజల ముందుకు వచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబులకు ఏపీ ప్రజలు గట్టి షాకిచ్చారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన పవన్.. రెండు స్థానాల్లో పోటీచేయగా ఆ రెండు స్థానల్లో ప్రజలు తిరస్కరించారు. భీమవరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ చేతిలో ఓటమి పాలైన జనసేనాని.. గాజువాకలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తిప్పాల నాగిరెడ్డి చేతిలో ఓటమి చవి చూశారు. ఇక ఎన్నికల ముందు పార్టీ కండువా కప్పుకొని నరసాపురం ఎంపీగా బరిలోకి దిగిన నాగబాబు.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రఘురామ కృష్ణంరాజు చేతిలో చిత్తుగా ఓడి మూడో స్థానంలో నిలిచారు. జనసేనాని ఓటమితో ఆ పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి ఆ పార్టీ మద్దతుదారులు ఊహించని ఫలితాలతో ముఖం చాటేశారు. ఆ పార్టీ అధికారిక ట్విటర్ మూగబోయింది.

## జగన్ ఘనవిజయం నేపథ్యంలో తెరపైకి 'యాత్ర-2'



**రాజధాని వార్తలు :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో నూతన అధ్యాయం మొదలైంది. కాంగ్రెస్ నుంచి విభేదించి వైసీపీని స్థాపించిన జగన్ ఈసారి ఎన్నికల్లో తన పార్టీని తిరుగులేని మెజారిటీతో అధికారంలోకి తీసుకొచ్చిన వైనం నిస్సందేహంగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పాలి. 175 సీట్లున్న ఏపీ అసెంబ్లీలోకి ఏకంగా 150కి పైగా సీట్లతో అడుగుపెట్టడం మామూలు విషయం కాదు. ఈ నేపథ్యంలో, దివంగత వైఎస్సార్ పాదయాత్ర ఆధారంగా యాత్ర చిత్రాన్ని తెరకెక్కించిన టాలీవుడ్ యువ దర్శకుడు మహి వి రాఘవ్ జగన్ గ్రాండ్ విక్టరీపై స్పందించారు."ఈ విజయానికి మీరు నిజంగా అర్హులు అన్నా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు చేసిన మంచిపనులను మించిపోయేలా మీరు పరిపాలన చేస్తారని భావిస్తున్నాం. భావితరాలకు వివరించదగిన చరిత్ర సృష్టించారు మీరు" అంటూ ట్వీట్ చేయడమే కాకుండా యాత్ర-2 అంటూ హ్యాష్ ట్యాగ్ కూడా పెట్టారు. దాంతో, జగన్ గెలుపు ప్రస్థానాన్ని యాత్ర-2 గా తెరకెక్కించే ఉద్దేశాన్ని మహి వి రాఘవ్ చెప్పకనే చెప్పారు.

# మంగళగిరిలో ఓడిన నారా లోకేశ్



**రాజధాని వార్తలు, అమరావతి :** మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఫలితం వెల్లడైంది. ఉదయం నుంచి అత్యంత ఉత్కంఠ రేకెత్తించిన ఈ నియోజవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనయుడు, మంత్రి, టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ఘోర పరాజయం పాలయ్యారు. ఈ స్థానం నుంచి ప్రస్తుతం ప్రాతినిథ్యం వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఆళ్ల రామక ృష్ణారెడ్డి 5312 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. గురువారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత తొలి రౌండు నుంచీ ఆర్కే తన ఆధిక్యతను కనబరిచారు. అయితే, ప్రతి రౌండులోనూ ప్రత్యర్థి లోకేశ్‌కు మధ్య ఓట్ల వ్యత్యాసం తక్కువగా ఉండటంతో ఫలితంపై చివరి వరకు ఉత్కంఠభరిత వాతావరణం ఏర్పడింది. **రాత్రి 8 గంటల ప్రాంతంలో తుది రౌండు లెక్కింపు పూర్తయిన తర్వాత 5312 ఓట్ల ఆధిక్యతతో ఆర్కే జయకేతనం ఎగురవేశారు.**

లోకేశ్ ఓటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పెద్ద షాక్‌లా తగిలింది. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన లోకేశ్‌ను ఎలాగైనా గెలిపించి సమీప భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ పగ్గాలను అప్పగించాలన్న ఆలోచనతో చంద్రబాబు నాయుడు ఉన్నారని అప్పట్లో వార్తలొచ్చాయి. ఎన్నికల్లో ఓటమితో చంద్రబాబు ఇప్పుడు ఏం చేయాలో అర్థంకాని గందరగోళంలో పడిపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళగిరి నియోజకవర్గం నుంచి లోకేశ్ ను పోటీ చేయించాలని నిర్ణయించిన తర్వాత జనసేన అక్కడి నుంచి పోటీ చేయకుండా తప్పుకుంది. జనసేన పొత్తు పేరుతో ఆ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. సామాజిక వర్గం, రాజధాని ప్రాంతం అంటూ అనేక కోణాల్లో విశ్లేషించుకున్న తర్వాతే విజయం సులభమని భావించిన తర్వాతే లోకేశ్ ను అక్కడి నుంచి పోటీ చేయించాలని చంద్రబాబు నిర్ణయించారు. లోకేశ్ కోసం అత్యంత శ్రేయోస్కరమైన నియోజకవర్గం ఏదవుతుందోనని అనేక విధాలుగా సర్వేలు చేయించిన తర్వాత భీమిలి, మంగళగిరి నియోజకవర్గాల నుంచి పోటీ చేయించడం మంచిదని చంద్రబాబు నిర్ణయానికొచ్చారు. చివరగా మంగళగిరిని ఎంపిక చేసుకున్నారు.

ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి ఆర్కే గట్టి పోటీనివ్వడంతో లోకేశ్ తన అధికార శక్తియుక్తులన్నీ ప్రయోగించారు. ఎన్నికల్లో పూర్తి సమయాన్ని వెచ్చించారు. ఆర్థిక అంగబలాన్నంతా ప్రయోగించారని వార్తలొచ్చాయి. తెలుగుదేశం పార్టీ బాధ్యతలను అప్పగించాలనుకున్న నేపథ్యంలో చంద్రబాబు నాయుడు సైతం ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతిరోజూ నియోజకవర్గం నేతలతో సమాలోచనలు జరిపారు. ఇంత చేసినప్పటికీ చివరికి ఓటమి పాలవ్వడంతో చంద్రబాబుతో పాటు ఆయన సన్నిహితులు తీవ్ర నిరాశలో మునిగిపోయారని పార్టీ వర్గాలు చెప్పాయి. నాయకత్వం వహించే విషయంలో మొదటి నుంచీ లోకేశ్ పై సొంత పార్టీ నుంచే విమర్శలు వ్యక్తమైనప్పటికీ చంద్రబాబు నాయుడు కుమారుడు కావడంతో పార్టీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడలేకపోయారు. తాజా ఎన్నికల్లో ఘోర పరాజయం ఆ పార్టీ నేతలు ఒకరకమైన గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇకపోతే, ప్రస్తుతం శాసనమండలికి ప్రాతినిథ్యం వహిస్తున్న లోకేశ్ ను ప్రజలు తిరస్కరించిన నేపథ్యంలో తాజా ఓటమికి నైతిక బాధ్యత వహించి ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పుకుంటారా? లేక కొనసాగుతారా? అన్నది ఇప్పుడే చెప్పలేమని ఆయన సన్నిహితుడొకరు చెప్పారు.

# మామని గెలిపించి అల్లుళ్లని ఓడించారు



**ఓడిన బాలకృష్ణ ఇద్దరు అల్లుళ్లు**

**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. హిందూపురం అసెంబ్లీ నుంచి పోటీ చేసిన నందమూరి బాలకృష్ణ విజయం సాధించగా ఆయన ఇద్దరు అల్లుళ్లు మాత్రం ఓటమిపాలయ్యారు. చంద్రబాబు నాయుడుతో సహా.. టీడీపీ అత్యంత ప్రతిష్టాత్మంగా భావించిన మంగళగిరి అసెంబ్లీ స్థానంలో పోటీ చేసిన బాలకృష్ణ పెద్ద అల్లుడు నారా లోకేష్ ఓటమి పాలవ్వడం సంచలనం రేపింది. ఆయనపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆళ్ల రామక ృష్ణారెడ్డి 5 వేల పైచీలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొంది సంచలన విజయాన్ని నమోదు చేశారు. అలాగే విశాఖపట్నం లోక్‌సభ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బాలకృష్ణ చిన్న అల్లుడు భరత్ వైస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చేతిలో ఓటమిచెందారు. ఈ పరిణామంతో ఏపీ ఎన్నికల్లో మామ గెలిచి ఇద్దరు అల్లుడు ఓడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

కాగా ఉత్కంఠ భరితంగా సాగిన మంగళగిరి అసెంబ్లీ పోటీలో ఆర్కే విజయం సాధించి చరిత్ర సృష్టించారు. నారా లోకేష్ ఈ స్థానం నుంచి పోటీ చేస్తుండడంతో ఏపీతో పాటు దేశ వ్యాప్తంగా మంగళగిరి ఫలితం కోసం ఉత్కంఠంగా ఎదురుచూశారు. చివరి వరకూ ఆసక్తికరంగా సాగిన పోరులో లోకేష్ ఓటమి పాలయ్యారు. దీంతో చంద్రబాబుతో టీడీపీ శ్రేణులంతా తీవ్రంగా నిరాశ చెందారు. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న లోకేష్ టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్సీ కోటాలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారడంతో రాజధాని ప్రాంతమైన అమరావతి నుంచి లోకేష్‌ను బరిలో నిలిపారు.

టీడీపీ తురుపుముక్కగా భావిస్తున్న లోకేష్ ప్రత్యక్షంగా పోటీచేసిన తొలి ఎన్నికల్లోనే ఓటమిపాలవ్వడం ఆపార్టీ జీర్ణించుకోలేని పరిణామం. చంద్రబాబు తరువాత పార్టీ బాధ్యతలు లోకేషే చేపడతారని ఆ పార్టీలో చర్చకూడా జరిగింది. చంద్రబాబుకు వయసు మీదపడడం, లోకేష్ ఓడిపోవడం.. పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కాగా లోకేష్ విజయం కోసం ఆయన భార్య బ్రాహ్మిణి, భరత్ గెలుపు కోసం ఆయన భార్య తేజస్విని తీవ్రంగా శ్రమించిన విషయం తెలిసిందే.

## జగన్ మాట తప్పడు: వైఎస్ విజయమ్మ



**రాజధాని వార్తలు, తాడేపల్లి :** తన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవుతారని తాను ముందే ఊహించానని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలు విజయమ్మ అన్నారు. దేవుడితో పాటు ప్రజల ఆశీస్సులు, భగవంతుడి క ృప వల్లే విజయం దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తప్పకుండా అమలుపరుస్తారని తాను ఆశీస్తున్నట్లు విజయమ్మ తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 30వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కాగా ఆంధ్ర ప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సునామీలో తెలుగుదేశం పార్టీ నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. ఇక టీడీపీ బీ టీమ్‌గా బరిలో దిగిన జనసేన గ్లాస్ పగిలిపోయింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి వైఎస్సార్ జిల్లా వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గిర్రున తిరిగింది. ఫ్యాన్ గాలికి సైకిల్ ఎగిరిపోయింది. నూటికి వెయ్యి శాతం టీడీపీ గెలుస్తుందని బీరాలు పలికిన చంద్రబాబు నాయుడి పార్టీ ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్‌తో పాటు టీడీపీ కేబినెట్‌లోని మెజార్టీ మంత్రులు పరాజయం పాలయ్యారు. అటు లోక్‌సభ ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేస్తోంది. మొత్తం 25 లోక్ సభ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఆధిక్యంలో దూసుకుపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభంజనంతో టీడీపీ శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది.

COMMING SOON...
RAJADHANI GUIDE AMARAVATI
From Rajadhani Vartalu
9440662699
To Advertise Contact
98480 89624
94406 62699

# సాకారమైన దశాబ్ద నిరీక్షణ

ఆమె



**దశాబ్ద కాల నర్సుల నిరీక్షణ ఫలించింది. మిలటరీలో పనిచేస్తూ, సైనికులకు సత్వర చికిత్సలో భాగస్వాములైన మిలటరీ నర్సులను ఎక్స్‌సర్వీస్‌మెన్ (మాజీ సైనికోద్యోగులుగా) గుర్తించాలని పదేళ్లుగా మహిళా నర్సులు కోరుతుండగా వారి ఆకాంక్షను సుప్రీంకోర్టు సఫలీకృతం చేసింది. 2010లో దీనిపై ట్రిబ్యునల్ వారికి అనుగుణంగా తీర్పు వెలువరించగా,ఈ తీర్పుపై కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని పరిశీలించిన ధర్మాసనం వారి కోరిక న్యాయమైనదేనని తీర్పు నివ్వడంతో కేంద్రం వారిని మాజీ సైనికోద్యోగులుగా ఖరారు చేసింది.**

నర్సింగ్ అధికారులను కూడా మిగతా మిలటరీ అధికారులుగా గుర్తించాలని మాజీ ఎంఎన్ఎస్ అధికారి మేజర్ జనరల్ ఉషా సికిందర్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిని తిరస్కరించిన ట్రిబ్యునల్ వైద్యాధికారులతో సహా ఎవరినీ సైనికోద్యోగులుగా గుర్తించబోమని స్పష్టం చేసింది. దీనిపై తన ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ, ఇది వివక్ష, అవమానంతో కూడిన చర్యగా ఉష పేర్కొన్నారు. ముంబై నావల్ ఆసుపత్రిని దర్శించడానికి ఆమె వెళ్లినప్పుడు అప్పటి కమాండింగ్ ఆఫీసర్, రేర్ అడ్మిరల్ వీకే సింగ్ ఆమెకు అధికార గుర్తింపునివ్వడానికి నిరాకరించారు. అలాగే భుజంపై నక్షత్ర, జెండా గుర్తును కూడా ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీంతో ఆమె సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. అత్యున్నత కోర్టు వీరికి న్యాయం చేసినందున అవకాశం, వారి పిల్లలకు రిజర్వేషన్లు, మరికొన్ని ప్రయోజనాలు సమకూరతాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన ప్రకారం 1947,1965,1971,1999ల్లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాల్లోనూ, జమ్మూకాశ్మీర్, అల్లర్లు జరిగే ఈశాన్య రాష్ట్రాల్లో, ఐక్యరాజ్యసమితికి తోడ్పాటు అందిస్తున్న శాంతి దళాల్లో నర్సులు తమ సేవలు అందిస్తున్నారు. ప్రసుతం అపాయింట్‌మెంట్ ప్లేట్లతో సహా వారికి బ్రిగేడియర్ ఆపై అధికారిక గుర్తింపుతోపాటు వాహనాలను కూడా మిలటరీ సమకూర్చనుంది. మిలటరీ నర్సులు 28 సమస్యలను రక్షణ మంత్రిత్వశాఖ ముందు ఉంచింది. వాటిలో చాలావాటిని మంత్రిత్వశాఖ నిరాకరించింది. ప్రస్తుతం కోర్టు నిర్ణయం మేరకు నర్సులను మాజీ సైనికోద్యోగులుగా గుర్తించడంతో కొన్ని సవరణలు చేపట్టాల్సి ఉంది. ఇందు కోసం సిబ్బంది,శిక్షణా శాఖ మిలటరీ నర్సులతో చర్చలు చేపట్టి సాంకేతిక సమస్యలను పరిష్కరించనుంది. వాస్తవానికి ఇండియన్ మిలటరీ నర్సింగ్ సర్వీసు ఆర్డినెన్స్ (ఏఎఫ్ఎంఎస్) 1943 చట్ట ప్రకారం వారి ఎంపిక జరిగింది. దాదాపు 5,300 మహిళా నర్సులు మిలటరీలో సేవలు అందిస్తున్నారు. వీరంతా తమను మిలటరీ అధికారులుగా గుర్తించాలని దశాబ్ద కాలంగా కోరుకుంటున్నారు. ప్రస్తుతం వారికి క్యాంటీన్, పింఛన్, మాజీ సైనిక ఉద్యోగులకు కల్పించే ఆరోగ్య పథకాలను వారికి అందిస్తున్నారు. మాజీ సైనిక ఉద్యోగులుగా గుర్తిస్తే, అందుకు సంబంధించిన గుర్తింపు కార్డులు, పదవీవిరమణ అనంతరం మాజీసైనికోద్యోగిగా మళ్లీ ఉద్యోగంలో చేరే

## దీక్ష రక్షగా పవిత్రమాసం

- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారా లోకేశ్
- వడ్డేశ్వరం ఇఫ్తార్ విందులో వెల్లివిరిసిన మతసామరస్యం
- లవకుశ పాత్రధారులకు సన్మానం



**రాజధాని వార్తలు, అమరావతి :** నిష్టగా చేసే దీక్షలే రక్షగా రంజాన్ మాసం పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో టీడీపీ నేత షేక్ ఖాలేషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ మండుటెండలను కూడా లెక్క చేయకుండా కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు అల్లా శక్తినివ్వాలని ఆకాంక్షించారు. మహ్మద్ ప్రవక్త చూపించిన మార్గాన్ని ప్రతీ ముస్లిం అనుసరించాలని సూచించారు. అసత్యాలకు, దూషణలకు దూరంగా ఉండటం, దయాగుణం, దానగుణం కలిగి ఉండటం సత్ప్రవర్తన మార్గాలను అనుసరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. రంజాన్ మాసంలో చేపట్టిన దీక్షలతో భగవంతుని ఆశీస్సులు అందరికీ తప్పక లభిస్తాయన్నారు. మైనారిటీ లకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల సహకారం, అల్లా ఆశీస్సులతో పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మత సామరస్యానికి సంకేతంగా అలనాటి లవకుశ సినిమాలో లవకుశ పాత్రధారులకు మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా సన్మానం చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి గల్లా అరుణకుమారి, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, టీడీపీ నేతలు గంజి చిరంజీవి, పోతినేని శ్రీనివాసరావు, మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఓటర్లు 2.97 కోట్లు

- తూర్పు గోదావరిలో అత్యధికం
- అభ్యంతరాలుంటే తెలపాలని సూచన

**రాజధాని వార్తలు, అమరావతి :** స్థానిక సంస్థల ఎన్నికల సంగ్రామానికి రాష్ట్రం సమాయత్తం అవుతోంది. సాధారణ ఎన్నికలతో పోల్చితే హోరాహోరీగా జరిగే ఈ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నడుం బిగించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతాయి. దీంతో నెల రోజులుగా ఎస్ఈసీ ఈ ప్రక్రియపై తీవ్ర కసరత్తు చేసింది. అందులో భాగంగానే అన్ని జిల్లా కలెక్టర్లు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. గ్రామ పంచాయతీల వారీగా విడుదలైన జాబితాలను అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించారు. వాటిల్లో ఏమైనా అభ్యంతరాలుంటే పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని కలెక్టర్లు సూచించారు. వాటిపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విచారణ జరుపుతామని తెలిపారు. వాస్తవానికి పది రోజుల క్రితమే ముసాయిదా జాబితా విడుదల కావాల్సి ఉండగా, అధికారులంతా సార్వత్రిక ఎన్నికల హడావుడిలో ఉండటంతో 20కి వాయిదా వేశారు. పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించాల్సి ఉండటంతో జాబితాలో విడుదలలో జాప్యం జరిగింది. జిల్లాల్లోని పంచాయతీ సర్పంచ్, వార్డు పదవుల రిజర్వేషన్ల ప్రక్రియను సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. రాష్ట్రంలో మొత్తం 13 జిల్లాల్లో 13,000కుపైగా గ్రామ పంచాయతీలున్నాయి. తాజాగా 500 మంది ఓటర్లున్న తండాలను కూడా ప్రభుత్వం పంచాయతీలుగా గుర్తించింది. రాష్ట్రంలో సుమారు మూడు కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎస్ఈసీ గుర్తించింది. వారిలో సగానికిపైగా మహిళా ఓటర్లే ఉండటం విశేషం. సాధారణ ఎన్నికలలో మాదిరిగానే పంచాయతీ ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లే గెలుపో టమిల నిర్ణేతలుగా నిలువనున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 32,50,654 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళా ఓటర్లే 16,32,947గా ఉండటం విశేషం. ఈ ఏడాది జనవరి నాటికి ఉన్న అసెంబ్లీ ఓటర్ల జాబితా ప్రామాణికంగా ఈ గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాను విడుదల చేశారు.

**జిల్లాల వారీగా పంచాయతీ ఓటర్ల వివరాలు**

| జిల్లాపేరు | పంచాయతీలు | మొత్తం ఓటర్లు | పురుషులు | మహిళలు | ఇతరులు |
|---|---|---|---|---|---|
| తూర్పుగోదావరి | 1,072 | 32,50,654 | 11,17.606 | 16,32,94 7 | 91 |
| కర్నూలు | 908 | 28,90,884 | 14.39,183 | 14,51,258 | 443 |
| గుంటూరు | 1,029 | 26,12,000 | 12,80,000 | 13,32,000 | 138 |
| పశ్చిమ గోదావరి | 909 | 25,50,916 | 12,61,658 | 12,89,087 | 171 |
| చిత్తూరు | 1,372 | 24,41927 | 12,11,300 | 12,30,417 | 211 |
| అనంతపురం | 1,003 | 23,63,652 | 11,91,183 | 11,72,379 | 90 |
| కృష్ణా | 980 | 23,41,337 | 11,56,141 | 11,85,060 | 136 |
| ప్రకాశం | 1,038 | 19,50,160 | -- | -- | -- |
| నెల్లూరు | 940 | 16,11,886 | -- | -- | -- |
| విశాఖపట్నం | 924 | 18,02,730 | 8,85,005 | 9,17,654 | 71 |
| కడప | 791 | 14,83,195 | 7,33,347 | 7,49,719 | 129 |
| విజయనగరం | 919 | 14,80,099 | 7,33,372 | 7,46,671 | 56 |
| శ్రీకాకుళం | 1141 | 18,99,986 | 9,52,739 | 9,47,102 | 145 |

## "ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ"




**రాజధాని వార్తలు, విజయవాడ :** "పవిత్ర రంజాన్" (ఉపవాసముల నెల)మాసం సందర్భాన్ని పురస్కరించుకుని, విజయవాడ అంజలీ లయన్స్ క్లబ్ కోశాధికారి, లబ్బీ పేట మునిసిపల్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లయన్ ఎం.ఎస్.ఇమామ్ బాషా నేతృత్వంలో, లెనిన్ సెంట్రీలోని శ్రీ సిల్కో షోరూమ్ దగ్గర దాహార్తులకు "ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ " కార్యక్రమం చాలా ఘనంగా జరుగింది...ఈ సందర్భంగా ఇమామ్ బాషా మాట్లాడుతూ తన తల్లి స్వర్గీయ హాజీ జమీలునిస్సా బేగం పేరు మీద ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు చెప్పారు."రంజాన్",మాసంలో మిగతా మాసాల కంటే దానధర్మాలు చేస్తే,సేవా కార్యక్రమాలు చేపడితే ఎక్కువ పుణ్యం లభిస్తుందని,ఒక రూపాయి ఖర్చు పెడితే, దానికి డెబ్బయి (70) రెట్ల పుణ్యఫలం లభిస్తుందన్నారు.."ఎక్సరే" సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్మన్ రుట్టాల శ్రీలక్ష్మీదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు...."ఎక్సరే"ప్రెసిడెంట్ మాట్లాడుతూ,52వ రోజున చేరిన ఈ మజ్జిగ పంపిణీ ఏప్రిల్ 1 నుండి ప్రారంభ మైనదని, మే 31 వరకు జరుగుతుందని లయన్ కొల్లూరి పేర్కొన్నారు...ఇంకా ఈ కార్యక్రమంలో అంజలీ క్లబ్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రషీద్, మధుబాబు, జి. వి.వి.,ఉమామహేశ్వరరావు, రాజశేఖర్, శరాబంది రావు,ముఖేష్ జీ,"ఎక్సరే" కోశాధికారి వెంకట సుబ్బయ్య,గోపు రాము,ఎక్సరే రాజశేఖర్, మాలిక్ అహ్మద్,తదితరులు పాల్గొన్నారు..చాలామంది దాహార్తులు ఈ సేవా కార్యక్రమాన్నీ చేపట్టిన ఇమామ్ బాషా ను అభినందించారు....

## చంద్రబాబు, జగన్ నివాసాలకు పటిష్ట భద్రత





**రాజధాని వార్తలు, అమరావతి :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా చంద్రబాబు,జగన్ నివాసాల వద్ద పటిష్ట భద్రత చేపట్టారు. ఏపీలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. టీడీపీ, వైసీపీ తరపున ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలుపొందిన అభ్యర్థులు ఆయా పార్టీ అధినేతల ఇళ్లకు, కార్యాలయాలకు అనుచరులతో కలిసి వచ్చే అవకాశం ఉంది. వీరిద్దరి చంద్రబాబు, జగన్ నివాసాలు, పార్టీ కార్యాలయాలు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోనే ఉన్నాయి. దీంతో ఈ ఇద్దరు నేతల ఇళ్ల వద్ద ఏపీఎస్పీతో పాటు గుంటూరు అర్బన్ జిల్లా పోలీసులు భారీ భద్రతా చర్యలు తీసుకున్నారు. బుధవారం రాత్రి నుంచి వీరి నివాసాల వద్ద ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన రెండేసి కంపెనీల బలగాలు పహారా కాస్తున్నాయి. స్థానిక పోలీసులు సైతం 50 మంది చొప్పున భద్రతా విధుల్లో ఉంటారు.

కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలు తాడేపల్లికి దగ్గరగా ఉండటంతో ఆ జిల్లాల్లో గెలుపొందిన అభ్యర్థులు వెంటనే ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఒక్కసారిగా ఆయా పార్టీలకు చెందిన నేతలు తరలివస్తే వారందరిని నియంత్రించడం స్థానిక పోలీసులకు కష్టమవుతుందని భావించిన ఏపీ పోలీసులు ఏపీఎస్పీ పోలీసుల సాయం తీసుకున్నారు. ఇద్దరు నేతల ఇళ్ల వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.



మీడియా సెంటర్‌లో ఎన్నికల పర్యవేక్షణలో పాల్గొన్న రాజధాని వార్తలు ఎడిటర్ హుస్సేన్ ఖాన్, సీటీ కేబుల్ ఎడిటర్ కె. రూఫస్ తదితరులు




మంగళగిరిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించిన బ్యాంక్ మేనేజర్ జి.సపంత్ కుమార్, సిటీకేబుల్ ఎడిటర్ కె. రూఫస్, రాజధాని వార్తలు ఎడిటర్ హుస్సేన్ ఖాన్ తదితరులు



# రాజధాని క్లాసిఫైడ్స్

**హోటల్స్**

విజయవాడ
నోవోటెల్
ఫోన్ : 0866 6688999

విజయవాడ
గేట్ వే
ఫోన్ : 0866 6644444

విజయవాడ
సదరన్ గ్రాండ్
ఫోన్ : 0866 6677777

మల్కాపురం
స్వాగత్ మెస్ – ప్యూర్ వెజిటేరియన్
ఫోన్ : 90329 58580

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**ఇతరములు**

విజయవాడ బెంజ్ సర్కిల్
మీటింగ్ హాల్
ఫోన్ : 76809 94755

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) టైలర్స్
ఫోన్ : 9440307123

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెలగపూడి
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రెంటల్స్**

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

విజయవాడ
విజయవాడ బెంజ్ సెంటర్ దగ్గరలో పార్కింగ్ వసతిగల 1 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 76809 94755

**హస్పటల్స్**

విజయవాడ
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**షాప్స్**

తుళ్ళూరు
రేమాండ్స్ టైలర్స్
ఫోన్ : 9492470426

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**అమరావతి**

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444



## అఖిల ప్రియకు షాక్..

**రాజధాని వార్తలు, కర్నూలు :** మంత్రి అఖిలప్రియకు ఆళ్లగడ్డ ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ఆమెను ఓడించారు. అఖిలప్రియ పోటీ చేసిన ఆళ్లగడ్డ స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గంగుల బీజేంద్రరెడ్డి గెలుపొందారు. అయితే ఈ ఓటమికి ఆమె వ్యవహార శైలే ప్రధాన కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రిగా ఉండి కూడా నియోజకవర్గాన్ని అభివ ృద్ధి చేయకపోవడం, అధికారం చేతిలో ఉందని ఇష్టానుసారంగా ప్రవర్తించడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆమె ప్రవర్తన తీరు నచ్చక పలువురు నేతలు కూడా టీడీపీని వీడారు. ఇవన్నీ కూడా ఆమె ఓటమిలో కీలక భూమిక పోషించాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కాగా, గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన అఖిలప్రియ.. టీడీపీలో చేరి మంత్రి పదవి చేపట్టిన సంగతి తెలిసిందే.



మరోవైపు ఆమె సోదరుడు భూమ బ్రహ్మానందరెడ్డి కూడా నంద్యాలలో ఓటమి పాలయ్యారు.

# రిలయన్స్ ఆదాయం రూ.6.23 లక్షల కోట్లు

బిజినెస్



**ముంబై :** రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం ఆదాయంలో మాత్రమే కాకుండా ఇతర అంశాల్లో కూడా అగ్రస్థానంలో ఉంది. తాజా రికార్డులతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆదాయం, లాభం, మార్కెట్ విలువ పరంగా మెరుగైన స్థానంలో ఉంటూ, దేశంలో నెంబర్ 1గా ప్రత్యేకతను చాటుకుంది.ఆదాయంలో తాజాగా ఐవోసీని వెనక్కు నెట్టిన ఆర్ఐఎల్

అపర కుబేరుడు ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) మరో అరుదైన ఘనత సాధించింది. ఆదాయం పరంగా ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ను (ఐవోసీ) వెనక్కు నెట్టింది. దీంతో రిలయన్స్ ఆదాయం పరంగా దేశంలో అతిపెద్ద కంపెనీగా అవతరరించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం ఆదాయంలో మాత్రమే టాప్‌లో కొనసాగడం కాదు. ఇంకా ఇతర అంశాల్లోనే అగ్రస్థానంలో ఉంది. తాజా రికార్డులతో రిలయన్స్ ఇండస్ట్రీస్ 3 రకాలుగా... ఆదాయం, లాభం, మార్కెట్ విలువ పరంగా మెరుగైన స్థానంలో ఉంటూ, దేశంలో నెంబర్ 1గా ప్రత్యేకతను చాటుకుంది.

ఆర్ఐఎల్ 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.6.23 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. పోటీ సంస్థ ఐవోసీ టర్నోవర్ రూ.6.17 లక్షల కోట్లుగా ఉంది. అలాగే లాభం విషయంలోనూ రిలయన్స్ కంపెనీయే అగ్ర స్థానంలో కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఐవోసీ పోలిస్తే రిలయన్స్ రెట్టింపు స్థాయిలో రూ.39,588 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ విలువ పరంగా ఇప్పటికే రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలో టాప్ కంపెనీగా ఉంది. ఈ విషయంలో టీసీఎస్‌తో తరచూ పోటీ పడుతూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో టెలికం, రిటైల్, డిజిటల్ సేవలు వంటి వినియోగ ఆధారిత వ్యాపారాల్లోకి రిలయన్స్ పెద్ద ఎత్తున విస్తరించడం అగ్ర స్థానానికి చేరుకునేందుకు దోహదపడింది.

# మోడీ రికార్డు..



**రాజధాని వార్తలు, న్యూఢిల్లీ :** మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ తర్వాత లోక్‌సభలో పూర్తి మెజార్టీతో.. రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న ప్రధానిగా నరేంద్ర మోడీ నిలవనున్నారు. కొనసాగుతున్న ఫలితాల ట్రెండ్స్‌ను బట్టి చూస్తే.. 17వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల ఫలితాల్లో భాజపా 272 మార్కును తేలికగా దాటనున్నట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో 543 స్థానాలకు పోలింగ్ జరగగా భాజపా 282 స్థానాల్లో విజయం సాధించింది. 1951–52లో మొదటి లోక్‌సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నాలుగింట మూడు వంతుల సీట్లను జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ సాధించింది. అలాగే, 1957, 1962ల్లో జరిగిన ఎన్నికల్లోనూ పూర్తి మెజార్టీతో ఆయన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1951–52 ఎన్నికల్లో 489 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ 364 సీట్లు గెలుపొందింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మినహాయిస్తే మిగిలిన రెండు పార్టీలకు మాత్రమే రెండంకెల సీట్లు వచ్చాయి. 1957లో 494 స్థానాలకు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్‌కి 371 సీట్లు దక్కాయి. 1962లో 494 స్థానాలకు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్‌కి 361 దక్కాయి. 1967లో 520 స్థానాలకు ఎన్నికలు జరగగా నెహ్రూ కుమార్తె ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ 283 సీట్లను సాధించింది. ఇందిరా గాంధీని కాంగ్రెస్ నుంచి బహిష్కరించిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లో (1969లో) 518 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఆమె ఆధ్వర్యంలోని కాంగ్రెస్ (ఓ) 352 సీట్లు గెలిచి, పూర్తి మెజార్టీతో విజయం సాధించింది. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ–2లో అవినీతి, కుంభకోణాల ఫలితం ప్రభావంగా నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని భాజపా 282 సీట్లను సాధించింది. ఈ సారి కూడా బీజేపీ నెంబర్ మెజార్టీ సీట్లు ఖాయం అవుతుండడంతో.. పూర్తి మెజార్టీతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న ప్రధానిగా మోడీ నిలుస్తున్నారు.

# పాక్‌లో భారత ఎన్నికల ఫలితాల లైవ్!

## అమెరికాలోని థియేటర్‌లోనూ..!

**వాషింగ్టన్ :** సార్వత్రిక ఎన్నికల ఫలితాల తాకిడి భారత్‌లోనే కాదు దాయాది దేశం పాకిస్థాన్‌లోనూ ఉంది. ఈ రోజు ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో పాక్‌లో లైవ్ ప్రసారం చేయనున్నట్లు భారత హై కమిషన్ ప్రకటించింది. 'ప్రజాస్వామ్య పండుగ. గురువారం భారత సార్వత్రిక ఎన్నికల ఫలితాలను లైవ్‌లో వీక్షించండి. మధ్యాహ్నం 12 గంటలకు భారత హై కమిషన్ ఆడిటోరియంలో ప్రసారం చేయబోతున్నాం' అని పేర్కొంది. అంతేకాదు అమెరికాలోని ఓ థియేటర్‌లో భారత ఎన్నికల ఫలితాలను లైవ్ ప్రసారం చేయనున్నారు. రమేశ్ నూనే అనే ఐటీ ఉద్యోగి ఈ వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. ఆయన ప్రధాని నరేంద్ర మోదీకి వీరాభిమాని కూడా. మిన్నెసోటా రాష్ట్రంలోని మిన్నియాపోలిస్ నగరంలో ఓ థియేటర్‌లో ఎన్నికల ఫలితాలను ప్రదర్శించాలని నిర్ణయించుకున్నారు. ఆసక్తిగల వారు ఈ థియేటర్‌కు వచ్చి వివిధ ఛానెళ్ల ప్రసారం చేసే ఎన్నికల ఫలితాలను కూర్చుని వీక్షించవచ్చు. భారతీయ కాలమానం ప్రకారం గురువారం ఉదయం 8 గంటల నుంచి ఈ ఫలితాల 'షో' థియేటర్‌లో ప్రసారం అవుతుంది. ఈ నేపథ్యంలో దాదాపు 150 మంది ప్రవాస భారతీయులు 15 డాలర్ల విలువైన టికెట్లు కొనుగోలు చేశారట. ఓఎఫ్‌బీజేపీ (ఓవర్‌సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ) వర్గాలు అమెరికాలోని టెక్సాస్, వాషింగ్టన్, ఫ్లోరిడా, కాలిఫోర్నియా ప్రాంతాల్లో ఎన్నికల ఫలితాలు ప్రసారమయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.




# రెండు చోట్ల ఓటమి పాలైన పవన్ కల్యాణ్



**రాజధాని వార్తలు,అమరావతి :** తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఘోర పరాభవం ఎదురైంది. బీఎస్పీ, వామపక్షాల మద్దతుతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన పవన్‌కు ఈ ఎన్నికలు చేదు ఫలితాన్ని మిగిల్చాయి. ప్రశ్నిస్తా అంటూ ప్రజల ముందుకు వచ్చిన పవన్.. పోటీ చేసిన రెండు చోట్ల ఓటమి పాలవడంతో జనసేన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. భీమవరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ చేతిలో ఓటమి పాలైన జనసేనాని.. గాజువాకలో మూడో స్థానానికి పరిమితమై ఘోర పరాజయం పాలయ్యారు. అయితే రాజకీయ అనుభవం లేకపోవడం, ప్రచార సరళిలో ఆయన వ్యవహరించిన తీరే ఓటమికి ప్రధాన కారణంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కాగా గత ఎన్నికల్లో చంద్రబాబు తరఫున ప్రచారం నిర్వహించిన సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్– టీడీపీల అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'పాలనలో వైఫల్యం చెందిన ప్రభుత్వాన్ని విమర్శించకుండా.. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర చేసిన జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడానికే పవన్ ఎక్కువ సమయం కేటాయించడం.. ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పటికీ ఏదో నామమాత్రంగా నాలుగు మాటలు మాట్లాడేసి వైఎస్సార్ సీపీని ఆడిపోసుకోవడానికే ఆయన ప్రాధాన్యం ఇవ్వడం.. అంతేకాక టీడీపీకి లాభం చేకూర్చే విధంగా ఒక అండర్‌స్టాండింగ్ ప్రకారం అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా పవన్ ప్రజల నమ్మకాన్ని కోల్పోయారు' అని ఆయన ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. అదేవిధంగా లోపాయికారి ఒప్పందం ద్వారా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించి తొలి ఎన్నికల్లోనే ఘోర పరాభవం చవిచూశారని పేర్కొంటున్నారు.



## ఆర్కే ఘన విజయం

**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి నియోజకవర్గంలో ఆళ్ల రామకృష్ణా రెడ్డి 5312 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ప్రజలు తన మీద పెట్టిన నమ్మకంతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



## రాజధానిలో వైసీపీ అభ్యర్థి విజయం

**రాజధాని వార్తలు, తాడికొండ :** తాడికొండ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డా॥ ఉండవల్లి శ్రీదేవి 4782 ఓట్ల మెజారిటీతో శ్రావణ్ కుమార్‌పై గెలుపొందారు. ప్రజలకు దగ్గరగా ఉండి ఉత్తమ సేవలు అందిస్తానని ఆమె ప్రచారంలో హామీ ఇచ్చారు.

నారా లోకేష్ కుప్పం నుంచి పోటీ చేస్తే గెలుస్తాడని, మంగళగిరి నుంచి చంద్రబాబు నాయుడు పోటీచేయబోతున్నారని రాజధాని వార్తలు (17-02-19) న ప్రచురించిన కథనం

కాని బాబు గారు మంగళగిరిలో లోకేష్‌ను నిలబెట్టి తన ఓటమికి కారణమయ్యారు.






నాన్న ఏం చెద్దాం!

# రాజకీయాల్లో రోల్‌మోడల్ జగన్

**రాజధాని వార్తలు, అమరావతి :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రమాదంలో దుర్మరణం చెంది ఉండకపోతే ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో ఇంత కీలకంగా మారి ఉండేవారే కాదేమో. 2009లో ఆయన మొదటిసారి కడప నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తండ్రి జీవించి ఉంటే ఆయనతోనే కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ, మహా అయితే ఇప్పుడు మూడోసారి లోక్‌సభకు పోటీ చేసి ఉండేవారు. ఇంకా మాట్లాడితే, కేంద్రంలో మంత్రి అయి ఉండేవారు.



### నమ్మినదానికోసం నిలబడే తత్వం

రాజకీయాలు కొత్తగా ఉండాలని, భిన్నంగా ఉండాలని నమ్ముతున్న కొత్త తరం నాయకులకు ప్రతినిధిగా కనిపిస్తారు జగన్. ఇప్పటి వరకు ఆయన అధికారంలో లేరు కాబట్టి ఆయన పాలనా దక్షత గురించి చెప్పుకునే అవకాశం ఇంకా రాలేదు. కానీ పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునని నమ్మే నాయకుడిలాగా కనిపిస్తారు. ఎవరినైనా సరే ఎదిరించి నిలబడే తత్వం కలిగిన వ్యక్తిలా కనిపిస్తారు. కష్టాన్ని నష్టాన్ని భరించి ముందుకు సాగే తత్వం ఆయనది.

రాజకీయాల్లోకి ప్రవేశించిన కొద్ది మాసాలకే తండ్రిని కోల్పోవడం, ఆ తరువాత కొద్ది రోజులకే కాంగ్రెస్ పార్టీతో వైరం తెచ్చుకోవడం, కేసుల్లో ఇరుక్కోవడం, 16 మాసాలు జైలు జీవితం గడపాల్సి రావడం... ఇవేవీ జగన్మోహన్ రెడ్డి సంకల్పాన్ని బలహీనపరిచినట్టు కనిపించదు.

### తండ్రి మరణంతో రాష్ట్ర రాజకీయాల్లోకి...

2009లో కడప నుంచి 15వ లోక్‌సభకు ఎన్నిక కావడంద్వారా ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. ఆయన కుటుంబం చాలా కాలంగా రాజకీయాలతో ముడిపడిందే. మొదట ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగానే లోక్‌సభకు ఎన్నికయ్యారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తరవాత అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వారందరినీ పలకరించాలని జగన్ అనుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించడం కోసం ఆయన రాష్ట్ర వ్యాప్తంగా 'ఓదార్పు యాత్ర' ప్రారంభించారు. ఈ యాత్ర నిలిపివేయాలని కాంగ్రెస్ అధిషా'నవర్గం ఆదేశించింది. అయితే జగన్ ఆ ఆదేశాలను ఖాతరు చేయకుండా 'ఓదార్పు యాత్ర' కొనసాగించారు. 'ఇది తన వ్యక్తిగత వ్యవహారం' అన్నారు. దీంతో కాంగ్రెస్‌తో సంబంధాలు తెగిపోయాయి.

### ఆ నిర్ణయం అభినందనీయం

దేశమంతటా ఇప్పుడు రాజకీయ పార్టీలను చికాకు పరుస్తున్న పార్టీ ఫిరాయింపుల విషయంలో జగన్మోహన్ రెడ్డి తీసుకున్న వైఖరి కచ్చితంగా ప్రశంసించదగ్గది. ఇతర పార్టీల తరఫున గెలిచి తరువాత తన పార్టీలోకి మారదల్చుకున్న వారందరికీ జగన్మోహన్ రెడ్డి ఒక షరతు విధించారు. వేరే పార్టీ ద్వారా సంక్రమించిన పదవికి రాజీనామా చేసి, దాన్ని ఆమోదింపచేసుకున్న తరువాతే తన పార్టీలో చేరాలన్న నియమం అది. ఇప్పటి వరకూ ఆయన దాన్ని కచ్చితంగా పాటిస్తూ రావడం విశేషం. ఇది దేశంలో మొత్తం అన్ని



చెమటోడ్చి పార్టీని విజయ పథాన నడిపించిన జగన్ మోహన్ రెడ్డి

రాజకీయ పార్టీలకూ ఆదర్శంగా నిలిచే చర్య. వయసు రీత్యా రాజకీయంగా చాలా భవిష్యత్తు ఉన్న నాయకుడు జగన్ మోహన్ రెడ్డి.

### బయోడేటా

జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా పులివెందులలో 1972 డిసెంబర్ 21న జన్మించారు. పులివెందులలో కొంత కాలం, ఆ తరవాత హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో పాఠశాల విద్య అభ్యసించారు. బీకామ్ పట్టభద్రులు. ఆయన చెల్లెలు షర్మిల కూడా రాజకీయాల్లోనే ఉన్నారు. ఆయన ప్రొటెస్టెంట్ క్రైస్తవుడు. 1996లో భారతీరెడ్డితో వివాహం. వారికి హర్షా, వర్షా ఇద్దరు కూతుళ్లు. మితంగా తినడం ఇష్టం. టీ అంటే ఎక్కువ ఇష్టపడుతారు. తెల్లచొక్కాలు ధరించడానికి ప్రాధాన్యతనిస్తారు. వైఎస్ రాజశేఖర రెడ్డి మాదిరిగానే తెల్లచొక్కా చేతులు కొంతవరకు పైకి మడిచి ధరిస్తారు.

## వైఎస్ జగన్‌కు శుభాకాంక్షలు : లోకేశ్



**రాజధాని వార్తలు,అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి నారా లోకేశ్ ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు... 'గత ఐదేళ్ళు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గురించి అలుపెరుగని కృషి చేసిన తెలుగుదేశం ఈ ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నా తెదేపా ఎప్పుడూ ప్రజాపక్షమే. ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీ నరేంద్ర మోదీ, వైఎస్ జగన్‌లకు శుభాకాంక్షలు' అని ట్వీట్ చేశారు.

కాగా ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు తుది దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పట్టారు. ఇటు శ్రీకాకుళం మొదలు అనంతపురం వరకూ అన్ని జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో విజయఢంకా మోగించింది. ఫ్యాన్‌గాలికి సైకిల్ కకావికలమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొలి నుంచి స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతోంది. టీడీపీ ఘోర పరాజయం బాటలో పయనిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ హవా జోరుగా వీస్తోంది.



కాబోయే ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి గారికి శుభాభినందనలు తెలుపుతున్న షేక్ బడేమియా (రాయపూడి వైయస్ ఆర్ సీపీ నేత) జగనన్న ప్రభుత్వం ప్రజలకు అత్యంత మెరుగైన సేవలు అందిస్తుందని బడేమియా తెలిపారు. రాజధాని అమరావతిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని ఆయన కొరారు.




## ముఖ్యమంత్రి పదవికి చంద్రబాబు రాజీనామా

**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి టీడీపీ అధినేత చంద్రబాబు రాజీనామా చేశారు. చంద్రబాబు రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజాతీర్పు వైసీపీకి అనుకూలంగా రావడంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏపీకి చంద్రబాబు చేసిన సేవలకు గవర్నర్ ధన్యవాదాలు తెలిపారు. తదుపరి ఏర్పాట్లు జరిగే వరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని చంద్రబాబును ఆయన కోరారు. చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, Decl. Before SDM Guntur dt. 07/01/2019
Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com.